జనవరిలో అందుబాటులోకి కమాండ్ కంట్రోల్ భవనం: మేయర్

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరుగుతున్న పనుల వివరాలు తెలుసుకుంటున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, నవంబర్ 22: స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సిస్టమ్ నూతన భవనాన్ని వచ్చే జనవరిలో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. శుక్రవారం నగరంలోని కేబుల్ బ్రిడ్జి సమీపంలో స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా రూ. 16కోట్లతో నిర్మిస్తున్న స్పెషల్ పర్పస్ వెహికిల్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ఆఫీస్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి పనితీరును తనిఖీ చేశారు. సిబ్బంది నుంచి పలు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, పీఎంసీ, కాంట్రాక్టర్ మధ్య సమన్వయం లోపంతో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సిస్టమ్ నూతన భవన నిర్మాణ పనుల్లో కొంత ఆలస్యం జరిగిందన్నారు. ఇప్పటికే 70 శాతం పూర్తయ్యాయిని, మిగతా 30 శాతం పెండింగ్ పనులు గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే త్వరలోనే 24 గంటల మంచి నీటి సరఫరా ప్రాజెక్టును కూడా ప్రారంభించి, మొదటి విడుతలో 5 వేల గృహాలకు 24 గంటలు నీటి సరఫరా అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్, పీఎంసీ అధికారులు, కాంట్రాక్టర్, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ మరమ్మతు పనుల పరిశీలన

నగరంలో 33వ డివిజన్ భగత్‌నగర్ రిజర్వాయర్ పరిధిలో 300 ఎంఎం డయా మంచినీటి పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులను మేయర్ పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేసి డివిజన్ ప్రజలకు నీరు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మంచి నీటి సరఫరా లైన్‌మెన్ కాశీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలు ప్రారంభం

కొత్తపల్లి, నవంబర్ 22: కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో రెబల్ స్టార్ కృష్ణంరాజు, మెమోరియల్ కప్-2024 జాతీయ స్థాయి కరాటే పోటీలను శుక్రవారం సినీ హీరో సుమన్, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా హీరో సుమన్ మాట్లాడుతూ, విద్యార్థినులు, యువతులు కరాటే నేర్చుకుని ఆకతాయిలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. శ్యామలాదేవి మాట్లాడుతూ, కరాటే క్రీడతో మానసికోల్లాసం, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఎస్ఐ చైర్మన్, కరాటే సంఘం జిల్లా అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఒలింపిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గసి రెడ్డి జనార్దన్‌రెడ్డి, చైర్మన్ వసంత్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షులు నరేందర్, సాయికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, నిర్వాహకుడు శ్రీనివాస్, సీనియర్ మాస్టర్ సురభి వేణు గోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

శంకరపట్నం, నవంబర్ 22: కక్షిదారులు జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సెల్ అడ్వైజర్స్ సందెల వెంకన్న, చల్లూరి రాజు, పులుగు లతారెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కక్షిదారులు రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంచి పెట్టారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

- అంగన్‌వాడీ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి
- 'శుక్రవారం సభ'లో కలెక్టర్ పమేలా సత్పతి

వీణవంక, నవంబర్ 22: మహిళలు, శిశువుల ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. మండలంలోని ఎలుబాక గ్రామంలో జరిగిన శుక్రవారం సభకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలను వారి ఆరోగ్య సమస్యలు, అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు స్వయంగా పౌష్టికాహారం తినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శుక్రవారం సభలో గర్భిణులు, బాలింతలు, ఐదేండ్లలోపు పిల్లలకు ఆరోగ్య ఉపకేంద్రాల్లో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని

ఎలుబాక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి పౌష్టికాహారం తినిపిస్తున్న కలెక్టర్

తెలిపారు. మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో సరస్వతి, మండల ప్రత్యేకాధికారి సీపీవో కొమురయ్య, ఆర్డీవో రమేశ్‌బాబు, డీఎంహెచ్‌వో వెంకటరమణ, అడిషనల్ డీఆర్‌డీవో సునీత, సీడీపీవో సుగుణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఎంపీడీవో శ్రీధర్, తహసీల్దార్ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెప్మా పీడీగా వేణుమాధవరెడ్డి బాధ్యతల స్వీకరణ

కలెక్టరేట్, నవంబర్ 22 : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌గా వేణుమాధవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో విధులు నిర్వహించిన రవీందర్ మాతృశాఖకు బదిలీకాగా, కొద్దినెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉన్నది. స్టేట్ ఆడిట్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్‌లో అధికారి స్థాయిలో బాధ్యతల్లో కొనసాగుతున్న వేణుమాధవరెడ్డిని పీడీగా నియమించడంతో, శుక్రవారం ఆయన విధుల్లో చేరారు. అంతకుముందు వేణుమాధవరెడ్డి కలెక్టర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. అలాగే ఆయనను పలు ఉద్యోగ సంఘాల బాధ్యులతో పాటు టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు దారం శ్రీనివాసరెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావు, తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సౌత్ ఇండియా సదరణ్ డ్రామా ఫెస్టివల్‌లో ఉత్తమ నటిగా పారమిత విద్యార్థిని

కమాన్‌చౌరస్తా, నవంబర్ 22: సౌత్ ఇండియా సదరణ్ డ్రామా ఫెస్టివల్ పోటీల్లో భాగంగా ఈ నెల 14, 15 తేదీల్లో బెంగళూర్‌లో నిర్వహించిన సైన్స్ డ్రామా పోటీల్లో

విద్యార్థినిని అభినందిస్తున్న ప్రసాద రావు

నగరంలోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థిని నాగ జైత్ర ఉత్తమ నటిగా ఎంపికైనట్లు హెచ్ఎం బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. సౌత్ ఇండియా సదరణ్ డ్రామా ఫెస్టివల్‌లో వరుసగా మూడు సంవత్సరాలుగా పాల్గొని అందరినీ ఆకర్షించేలా నటించడం గర్వకారణమని పాఠశాలల చైర్మన్ కొనియాడారు. పోటీల్లో పాల్గొన్న అమితేశ్వర్, అర్జున్, సంప్రీతి, శ్రీనిధి, సమీక్ష, సుహృత, అనుశ్రీ, నాగజైత్రను పారమిత పాఠశాలల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. ఇక్కడ పాఠశాలల డైరెక్టర్లు, గైడ్ టీచర్స్, డాన్స్ మాస్టర్ తదితరులు ఉన్నారు.

మార్కెట్ యార్డును సందర్శించిన వింధ్యావ్యాలీ విద్యార్థులు

కొత్తపల్లి, నవంబర్ 22 : జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావ్యాలీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం నగరంలోని మార్కెట్‌యార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు మార్కెట్ యార్డులో నిర్వహించే క్రయవిక్రయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాల్లో భాగంగా ప్రత్యక్ష బోధన కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు వింధ్యావ్యాలీ ఉన్నత పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశ్ రావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి. ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానేరు విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి, నవంబర్ 22: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీల్లో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు సత్తా చాటి జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి. సరితా రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన పి. శ్రీతేజ మెహందీ పోటీల్లో జిల్లాస్థాయిలో మొదటి స్థానం, ఎన్ శ్రీరామ్ పాటల పోటీల్లో ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డితో పాటు డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

24న జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కొత్తపల్లి, నవంబర్ 22 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలను ఈనెల 24న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాల సింథటిక్ ట్రాక్స్‌లో అండర్-8, 10, 12 విభాగాల్లో బాల బాలికలకు పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నందలి మహిపాల్, కడారి రవి తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను మంచిర్యాల జిల్లాలో డిసెంబర్ ఒకటో తేదీన జరుగనున్న పదో తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 8 గంటలకు స్పోర్ట్స్ స్కూల్ క్రీడామైదానంలో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు: ఎస్ఈ

ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభించిన అనంతరం డీఈ, ఏడీఈ, ఏఈ, సిబ్బందితో ఎస్ఈ రమేశ్ బాబు

ముకరంపుర, నవంబర్ 22: అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ రమేశ్ బాబు తెలిపారు. నగరంలోని టౌన్-8 సెక్షన్ వాటర్ వర్క్స్ సబ్ స్టేషన్‌లో 5ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్ స్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన 8ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇకపై టౌన్-8పరిధిలో వేసవిలో అధిక లోడు ఉన్నా ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతరం నాణ్యమైన సరఫరా ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈలు రాజం, కాళిదాసు, ఏడీఈలు శ్రీనివాస్, కిరణ్ కుమార్, ఏఈ షఫీఅహ్మద్, రమేశ్, ఎస్ఎల్ఐ మహేందర్ రావు, ఇంద్రసేనారెడ్డి, ప్రకాశ్, రవీందర్, జితేందర్, ఏఎల్ఎంలు పాల్గొన్నారు.

ప్రైవేటు హాస్పిటల్స్‌లో ఆకస్మిక తనిఖీ

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 22: పట్టణంలోని సూపర్ బజార్ రోడ్డులో గల పలు ప్రైవేటు హాస్పిటల్స్‌ను శుక్రవారం హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని పలు హాస్పిటల్స్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా హాస్పిటల్స్ నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, కేవలం హాస్పిటల్‌కు వచ్చే వైద్యుల పేర్లు మాత్రమే ఉండేలా బోర్డులు ప్రదర్శించాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఇల్లందకుంట, నవంబర్ 22: జనవరి 1నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రాణి ఓ ప్రకటనలో సూచించారు. ఓటు హక్కు నమోదు కోసం ఈ నెల 23, 24న స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటు నమోదు చేసుకునేవారు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలను సంప్రదించాలని కోరారు.

నాయీబ్రాహ్మణ యువజన సంఘం కన్వీనర్‌గా శ్రీనివాస్

నియామక పత్రాలు అందుకుంటున్న నాయీబ్రాహ్మణ యువజన సంఘం జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, కో-కన్వీనర్ వేణు

తెలంగాణచౌక్, నవంబర్ 22: నాయీబ్రాహ్మణ యువజన సంఘం జిల్లా కన్వీనర్‌గా నగరానికి చెందిన సమ్మెట శ్రీనివాస్, కో-కన్వీనర్‌గా ఓరుగంటి వేణును నియమించినట్లు తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య, ప్రధాన కార్యదర్శి జంపాల సంపత్ తెలిపారు. శుక్రవారం నగరంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వీరికి నియామక పత్రాలు అందజేశారు. కాగా, తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శితో పాటు నియామకానికి సహకరించిన జిల్లా నాయకులకు కన్వీనర్, కో-కన్వీనర్ కృతజ్ఞతలు తెలిపారు.

సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, నవంబర్ 22: మానకొండూర్‌లో ఈ నెల 24న నిర్వహిస్తున్న రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రాజు కోరారు. నగరంలోని ప్రెస్‌భవనంలో జిల్లా కమిటీ సభ్యులతో కలిసి శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అటవీ శాఖ విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు చక్రపాణి, మధుసూదన్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి హత్య అమానుషం

చిగురుమామిడి, నవంబర్ 22: ములుగు జిల్లాలో పంచాయతీ కార్యదర్శి ఊకే రమేశ్‌ను మావోయిస్టులు హత్య చేయడం అమానుషమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోదారి అజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బి. రమేశ్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి రమేశ్ కుటుంబాన్ని ఆదుకోవాలని, కోటి రూపాయలు పరిహారం ప్రకటించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

హుస్నాబాద్ ఏఎంసీ చైర్మన్‌గా కంది తిరుపతిరెడ్డి

చిగురుమామిడి, నవంబర్ 22: హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి నియామకమయ్యారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా సుందరగిరికి చెందిన మాజీ ఎంపీటీసీ ఓరుగంటి భారతీ దేవి, ఇందుర్తికి చెందిన బొడిగే పరశురాములు, ముదిమాణిక్యానికి చెందిన మహ్మద్ కుత్బుద్దీన్‌ను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు కార్తీక లక్షదీప మహోత్సవం

కరీంనగర్ రూరల్, నవంబర్ 22: కార్తీక మాసం సందర్భంగా నగునూర్ గ్రామంలోని పరివార సమేత దుర్గాభవానీ ఆలయంలో శనివారం సాయంత్రం లక్ష దీప మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగళ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మాధికారి, వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతం, తులసీ కల్యాణం, సాయంత్రం అమ్మవారికి కార్తీక దీపారాధన, మహా మంగళ హారతి, అనంతరం లక్ష దీపోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వాడకం ప్రాణాంతకం

జమ్మికుంట, నవంబర్ 22: విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వాడకం ప్రాణాంతకమని, వైద్యుల సలహాలతో తగిన మోతాదులో మాత్రమే వాడాలని వావిలాల పీహెచ్‌సీ వైద్యుడు రాజేశ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని పాపక్కపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఎంఆర్ క్యాంపెయిన్ ఏర్పాటు చేశారు. శిబిరానికి ముఖ్య అతిథులుగా వైద్యుడు, హెచ్ఈ హాజరయ్యారు. యాంటీబయాటిక్స్ వాడకం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జ్వరం, దగ్గు, జలుబు, తదితర సమస్యలు వస్తే ప్రభుత్వ దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం టీబీ వ్యాధి లక్షణాలు, నిర్మూలనపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు సదానందం, రమ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులివ్వాలని వినతి

కార్పొరేషన్, నవంబర్ 22: నగరంలోని జ్యోతినగర్ కురుమ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని సంఘం నాయకులు శుక్రవారం శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కురుమ సంఘ నాయకులు కర్రె బీరయ్య, పబ్బల్ల వీరయ్య, కర్రె రాజు, మ్యాకల నర్సయ్య, కర్రె శ్రీను, కర్రె శ్రీనివాస్, పెద్దిగారి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

గంగాధర, నవంబర్ 22: కొండన్నపల్లి గ్రామానికి చెందిన విలాసాగరం లస్మవ్వ (110) శుక్రవారం మృతి చెందింది. ఆమె మరణించే వరకు కూడా పూర్తి ఆరోగ్యంతో ఉండి, ఎవరిపైనా ఆధారపడకుండా తన పనులు తానే చేసుకునేదని కుటుంబ సభ్యులు తెలిపారు. లస్మవ్వకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలతో కలిపి 23 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. అంత్యక్రియలు నిర్వహించారు.

నగునూర్‌లో ఎంపీవో విచారణ

కరీంనగర్ రూరల్, నవంబర్ 22: నగునూర్ గ్రామంలోని సిలింగ్ కేసు భూమిలో ఉన్న ఇంటి నంబర్‌ను రద్దు చేయాలని ఏఐఎఫ్‌బీ జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ జిల్లా పంచాయతీ అధికారికి ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం ఉదయం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఇక్కడ ఏఐఎఫ్‌బీ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బద్ధినేత, పంచాయతీ కార్యదర్శి లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల భవనానికి రూ.26 కోట్లు మంజూరు

విద్యానగర్, నవంబర్ 22 : రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలలకు అనుబంధంగా నూతనంగా ఏర్పాటు చేసిన 13 నర్సింగ్ కళాశాలలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసింది. ఒక్కొక్క కళాశాలలో 60 సీట్లు ఉండగా, భవన నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరు చేసింది.

బీసీల సమరభేరి విజయవంతం చేయాలి

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 22: ఈనెల 25న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే బీసీల సమరభేరిని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఐలేశ్ యాదవ్ పిలుపునిచ్చారు. పట్టణంలో ముఖ్య కార్యకర్తలతో శుక్రవారం ఆయన సమావేశమై మాట్లాడారు. కేంద్రప్రభుత్వం బీసీలపై వ్యతిరేక వైఖరిని వీడాలని కోరారు. సమావేశంలో నాయకులు హరికృష్ణ, శ్రీనివాస్ యాదవ్, సదయ్య యాదవ్, ధర్మేందర్ యాదవ్, సమ్మయ్య యాదవ్, బీసీ మహిళా నాయకులు లక్ష్మి, లత తదితరులు పాల్గొన్నారు.

25న అయ్యప్ప మహా పడిపూజ

గంగాధర, నవంబర్ 22: మధురానగర్ సుందరశాస్త అయ్యప్ప ఆలయంలో ఈ నెల 25న అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గురు స్వామి గుండి మల్లికార్జునరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఆలయంలో మాట్లాడుతూ, మహా పడిపూజ అనంతరం మాజీ ఎంపీపీ, ఆలయ ధర్మకర్త శ్రీరామ్ మధుకర్, శ్వేత దంపతుల చేతుల మీదుగా అల్పాహార కార్యక్రమం ఉంటుందని చెప్పారు. అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని మహా పడిపూజ విజయవంతం చేయాలని కోరారు. ఇక్కడ అయ్యప్ప స్వాములు రాజిరెడ్డి, మహేశ్, పనీంద్ర, రాజిరెడ్డి, రాము తదితరులు ఉన్నారు.

పిల్లలకు మూర్రు పాలు తప్పక పట్టించాలి

మానకొండూర్ రూరల్, నవంబర్ 22: పుట్టిన పిల్లలకు మూర్రు పాలు తప్పక పట్టించాలని సీడీపీవో శ్రీమతి తెలిపారు. గంగిపల్లి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన శుక్రవారం సభకు ఆమె హాజరై మాట్లాడారు. తల్లి పాల ప్రాముఖ్యత, అంగన్‌వాడీ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సరోజన, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, మహిళలు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం

కరీంనగర్ రూరల్, నవంబర్ 22 : నగరంలోని పాత బజార్ చెందిన నీల రాజేశ్వరి (70) గురువారం రాత్రి మృతి చెందగా, శుక్రవారం ఉదయం ఆమె కోరిక మేరకు కుమారుడు రమేశ్, కోడలు మాధవీలత నేత్రదానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు పంపించారు. కార్యక్రమంలో ఇంజినీర్ కోల అన్నారెడ్డి, చింత కిషన్ పటేల్, కరీంనగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముక్క శరత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ల్యాబ్ అసిస్టెంట్ మృతి

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 22: పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యానగర్‌కు చెందిన వకులాభరణం రమేశ్ (52) మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. సైదాపూర్ క్రాస్ రోడ్డు వద్ద బైక్‌పై రోడ్డు దాటుతున్న రమేశ్, అతివేగంగా అజాగ్రత్తగా కరీంనగర్ వైపు వెళ్తున్న భూపాలపల్లికి చెందిన కారు ఢీకొనడంతో రహదారిపై ఎగిరిపడ్డాడు. స్పందించిన స్థానికులు ఏరియా దవాఖానకు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, రమేశ్ స్థానికంగా ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో ల్యాబ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఐదేళ్ల క్రితం భార్య మృతి చెందగా, పెళ్లీడుకు ఎదిగిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

వీణవంక, నవంబర్ 22: రెడ్డిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముంజాల మల్లయ్య రోజువారీ వృత్తిలో భాగంగా శుక్రవారం ఈత చెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి గీతకార్మికులు 108 వాహనంలో జమ్మికుంటలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

నేడు సీతారాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

రామడుగు, నవంబర్ 22: వెంకట్రావుపల్లిలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో శనివారం హంపి విరూపాక్ష విద్యారణ్య మహాస్వామి ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణకర్తలు, గ్రామస్తులు తెలిపారు. ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా శుక్రవారం రిత్విక్కులు మూలమంత్ర హవనం, సామూహిక లక్ష్మీనారాయణ హవనం, ధాన్య, ఫల, పుష్ప, శయ్యాధివాసం, రాజోపచారాలు నిర్వహించారు. శనివారం ఉదయం 11.45 గంటలకు ప్రారంభమయ్యే స్వామివారి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, తదితర ప్రత్యేక కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవంలో తుమ్మనపల్లి కళాకారులు

సాంస్కృతి